క్లుప్తంగా

లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలి

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో సోమవారం స్టెప్ టు సక్సెస్ అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కెరియర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సివిల్ సర్వీసెస్ ట్రైనర్, మోటివేషనల్ స్పీకర్ మల్లవరపు బాల లత హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కచ్చితమైన లక్ష్యంతో ముందుకు సాగాలని, దాని కోసం నిరంతరం నిలకడగా శ్రమించాలన్నారు. కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ రామచంద్ర ఆర్కే మాట్లాడుతూ బాల లత ఇచ్చిన సందేశంతో విద్యార్థులు స్ఫూర్తిని పొందాలన్నారు. కెరీర్ గైడెన్స్ సెల్ కో ఆర్డినేటర్ బి.వెంకట్రావు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ దిశగా ముందుకు సాగడానికి భవిష్యత్తులో కూడా దిశా నిర్దేశం చేయాలన్నారు.

ఉపకరణాల నిర్ధారణ శిబిరం

కంబాలచెరువు: బైపాస్ రోడ్డులోని దానవాయిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సోమవారం దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, ఏఎంఓడీ.గౌరీ శంకరరావు, సీఎంవో శ్రీనివాస రావు, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, ఐఈ కోఆర్డినేటర్ కనక బాబు పాల్గొన్నారు.

పోసికుమార్‌కు పరామర్శ



పోసికుమార్‌ను పరామర్శిస్తున్న గిరజాల బాబు

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) సోమవారం పరామర్శించారు. పోసికుమార్ మావయ్య వంగ వీరభద్రరావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న గిరజాల వీర్రాజు (బాబు).. పోసికుమార్, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పోసికుమార్‌ను పరామర్శించిన వారిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల తిరుపతిరావు (అను), వైఎస్సార్ సీపీ కడియం మండలం మైనార్టీ సెల్ అధ్యక్షుడు సర్కార్ బాషా, కడియం మండలం గాయత్రి సంఘం ట్రెజరర్ పున్నమ రాజు వీర్రాజు, ఎస్సీ సెల్ నాయకులు శ్రీధర్, మహేష్ ఉన్నారు.

బ్రాహ్మణ సంక్షేమానికి కృషి



నరసింహమూర్తిని అభినందిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

సీటీఆర్ఐ: బ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేయాలని నూతనంగా నియమితులైన బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోమూర్తుల నరసింహమూర్తిని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం నరసింహమూర్తిని మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ రాజమండ్రి బ్రాంచ్ మేనేజర్ కె.నాగభూషణం పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో నగరంలో మంగళవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఆ సమయంలో నారాయణపురం, బాబా నగర్, సైకిల్ కాలనీ, గోపాలనగర్ పుంత, ఆర్టీఓ కార్యాలయం ఎదుట వీధులు, బలరామకృష్ణ నగర్, వాంబే గృహాలు, గెయిల్ కార్యాలయం పక్క వీధులు, ఏవీ అప్పారావు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

విద్యార్థులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌పీఎఫ్ సీఐ రాజు

రాజమహేంద్రవరం రూరల్: రైలు ప్రయాణికులు క్షేమంగా వారి గమ్యం చేరేకునేందుకు రైల్వే రక్షక దళం కృషి చేస్తుందని ఆర్పీఎఫ్ సీఐ బి.రాజు అన్నారు. రాజమహేంద్రవరం సత్యసాయి గురుకులంలో సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రైల్వే నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యాం సుందర్, ప్రిన్సిపల్ కె.గురయ్య, ఆర్‌పీఎఫ్ ఎస్సై లక్ష్మి పాల్గొన్నారు.

ప్రమాదాల మలుపులు

- ప్రమాదకరంగా కెనాల్ రోడ్డు
- పెరిగిపోయిన చెట్ల కొమ్మలు
- ముందు వచ్చే వాహనం కనిపించని వైనం
- దుళ్ల – మడికి రోడ్డులో పరిస్థితి



దుళ్ల - మడికి రోడ్డులో మలుపుల వద్ద ఎదుటి వాహనం కనిపించకుండా కమ్మేసిన చెట్ల కొమ్మలు

కడియం: మండల శివారు గ్రామమైన దుళ్ల నుంచి జాతీయ రహదారిని చేరుకునేందుకు మడికి వరకూ ఉన్న సుమారు 3.5 కిలోమీటర్ల రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. దీనికి ఒక పక్క పొలాలు, మరో పక్క పంట కాలువ ఉన్నాయి. పుంత రోడ్డుగా ఉండే దీన్ని దాదాపు ఆరేళ్ల క్రితం తారు రోడ్డుగా పునర్నిర్మించారు. దీంతో దుళ్ల గ్రామం నుంచే కాకుండా ఏడిద, మండపేట నుంచి సైతం పెద్ద ఎత్తున వాహనాలు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి.

ఎంతో కీలకం

కడియం మండల పరిధిలోని నర్సరీ మొక్కల రవాణా వాహనాలతో పాటు, మండపేట, ఏడిద పరిధిలోని రైస్‌మిల్లుల నుంచి ధాన్యం / బియ్యం తరలించే భారీ వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఈ రోడ్డు కీలకంగా మారింది. సులభంగా జాతీయ రహదారిని చేరుకునే అవకాశం ఉండడంతో దీని పైనే ఎక్కువగా ప్రయాణం చేస్తారు. ఇదిలా ఉండగా రోడ్డు వెంబడి కాలువ వారగా చెట్లను నాటారు. ఇవి ప్రస్తుతం గుబురుగా పెరిగి వాహన చోదకులకు ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ కింది నుంచి పైవరకూ కొమ్మలతో నిండిపోయిన ఈ చెట్ల కారణంగా దుళ్ల - మడికి రోడ్డులోని మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు.

పెరిగిపోయిన చెట్ల కొమ్మలు

ఈ రహదారిపై రెండు నెలల వ్యవధిలోనే నాలుగు ప్రమాదాలు జరిగాయి. వాటిలో ఒక యువకుడు మృతి చెందడంతో పాటు, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ రోడ్డులో దాదాపు అయిదు చోట్ల ఉన్న మలుపుల వద్ద ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొనే ప్రమాదం పొంచిఉంది. ఎదురుగా వచ్చే వాహనం కనిపించకుండా చెట్ల కొమ్మలు, తుప్పలు పెరిగిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డులో అత్యంత ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద స్థానికులు ఇటీవలే కొన్ని చెట్ల కొమ్మలు తొలగించారు. అధికారులు స్పందించి, ఇదే రీతిలో మొత్తం రోడ్డు వెంబడి ఉన్న పిచ్చిమొక్కలు, చెట్ల కొమ్మలను తొలగించాలని వారు కోరుతున్నారు.

చెట్ల కొమ్మలు తొలగించాలి

జాతీయ రహదారిని చేరుకోవడానికి దగ్గరగా ఉంటుందని దుళ్ల – మడికి రోడ్డు మీదుగా వెళుతున్నాం. కానీ మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు, చెట్ల కొమ్మలను తొలగించాలి.

– కె.బుల్లిబాబు, ఏడిద

తరచూ ప్రమాదాలు

ఈ రోడ్డు బాగుండడంతో ఎక్కువ మంది వాహనచోదకులు ఇటుగా రాకపోకలు సాగిస్తున్నారు. అయితే మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిలో చనిపోవడమో, దెబ్బలు తగలడమో జరుగుతోంది. మలుపుల వద్ద ఎదుటి వాహనం స్పష్టంగా కనిపించేలా చెట్ల కొమ్మలను తొలగించాలి.

– కార్తికేయ, వాహనచోదకుడు

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ మేఘ స్వరూప్



నగరపాలక సంస్థలో అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించరాదని, నిర్ణీత సమయంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘ స్వరూప్ ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో డీఆర్‌ఓ సీతారామమూర్తి, ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ సంతృప్తికరమైన పరిష్కారం లేకపోవడం వల్లే ఫిర్యాదులు మళ్లీ రీఓపెన్ అవుతున్నాయన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వస్తున్న ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు 14 మంది అర్జీలు అందించారు. అనంతరం అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రతి అర్జీపై సమగ్ర విచారణ చేసి, అర్జీదారుని సంతృప్తే లక్ష్యంగా చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. అలాగే అర్జీదారుడు తమ ఫిర్యాదు స్థితిగతులను 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అనంతరం వార్డు సచివాలయాల సిబ్బందితో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజ వల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్‌ఓ వినూత్న, ఎస్ఈ (ఇన్‌చార్జి) రీటా, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, రెవెన్యూ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

అన్ని వర్గాలనూ వంచించిన కూటమి



మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

- 11 నెలలుగా ఇమామ్, మౌజాన్‌లకు గౌరవ వేతనాలు లేవు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు వంచించబడ్డారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం 11 నెలలుగా మసీదుల్లోని ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ఆయనను సోమవారం బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో జిల్లాలోని మైనార్టీ నాయకులు కలిశారు. ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం చెల్లించకపోవడంపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లిం సామాజిక వర్గం తీవ్ర వెనుకబాటుతనానికి గురవుతోందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బకాయిలు లేకుండా ప్రతి నెలా అందజేయడం జరిగిందన్నారు. వెంటనే వారికి గౌరవ వేతనం విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మీర్జా మౌలాలీ, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ మహ్మద్ ఆరీఫ్, మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు అరిఫుల్లాఖాన్, షేక్ ఇబ్రహీం, షేక్ చానా, షేక్ మస్తాన్, మదీనా బాషా, ప్రింటుభాయ్ పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే ఆర్థిక అభ్యున్నతి



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కనకరాజు

రాజమహేంద్రవరం సిటీ: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చినప్పుడే ఆ కుటుంబాలు ఆర్థికంగా అభ్యున్నతి చెందుతాయని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.కనకరాజు తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని మెప్మా పాత కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై వలంటీర్ టీచర్లకు సోమవారం శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు చదువుకుంటే, వారి పిల్లల భవిష్యత్తు చక్కగా ఉంటుందన్నారు. 2029 నాటికి ఆంధ్రప్రదేశ్ వంద శాతం వయోజన ప్రాథమిక అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 15 -59 ఏళ్ల నిరక్షరాస్యులకు చదవడం, రాయడం, ప్రాథమిక గణితం, డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత వంటి అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఇందుకోసం ప్రతి పది మందికి స్వయం సహాయక బృందాల నుంచి ఒక వలంటీర్ టీచర్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. శిక్షణ అనంతరం వీరందరూ తమ తమ పరిధిలోని అభ్యాసకులకు క్రియాత్మక, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతను విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం వలంటీర్ టీచర్లకు బోధన పుస్తకాలు అందించారు. అనంతరం ఆయన గోకవరం బస్టాండ్ సమీపంలోని మహిళా మార్ట్, కంబాలచెరువులోని పట్టణ నిరాశ్రయుల వసతిగృహాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సీఎంఎం వి.రామలక్ష్మి, సాంకేతిక నిపుణులు ఎం.ఫణికుమార్, పి.శ్రీదేవి, టీఎంసీ సాయికుమార్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎల్‌ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు

రాజమహేంద్రవరం రూరల్: దేశాభివృద్ధిలో యువత పాత్ర చాలా కీలకమని జీవిత బీమా సంస్థ రాజమహేంద్రవరం సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు పిలుపునిచ్చారు. డివిజనల్ కార్యాలయంలో సోమవారం జీవితబీమా సంస్థ 69వ వారోత్సవాల ముగింపును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన కలరింగ్, చిత్రలేఖనం, పాటలు, క్విజ్ పోటీల్లో 14 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వీటిలో విజేతలుగా నిలిచిన ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్, మున్సిపల్ పబ్లిక్ స్కూల్, ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్, సిమెంట్రిపేట ఎంపీఎల్ ఎలిమెంటరీ స్కూల్, ప్రతిభ నెక్స్ట్ జెన్ స్కూల్, అక్షర శ్రీ స్కూల్, సిటీ స్పెషల్ ఎంపీఎల్ ఎలిమెంటరీ స్కూల్, లోటస్ నేషనల్ స్కూల్, శ్రీ సరస్వతీ ఎడ్యుకేషన్ అకాడమీ, లిటిల్ ప్యారడైజ్ స్కూల్, శ్రీ గౌతమి స్కూల్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, రెక్క నాగ శ్రీదేవి, పూర్ణ చంద్రరావు, సుబ్రహ్మణ్యం, వీర కిషోర్, గన్నయ్య, కోదండరాం పాల్గొన్నారు.

కోతులతో భయాందోళన



ధవళేశ్వరంలో సంచరిస్తున్న కోతుల గుంపు

ధవళేశ్వరం: కోతుల బెడదతో ధవళేశ్వరం గొల్లపేట వాసులు బెంబేలెత్తుతున్నారు. గుంపులుగా గుంపులుగా వస్తున్న కోతులతో భయాందోళన చెందుతున్నారు. అవి ఒక్కసారిగా ఇళ్లల్లోకి చొరబడి వస్తువులను పాడు చేయడం, స్థానికులపై దాడి చేసి గాయపరచిన సంఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. పదుల సంఖ్యలో కోతుల గుంపు సంచరిస్తుండటంతో స్థానికుల ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక గొల్లపేట, వాటర్ ట్యాంకు వీధుల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలోనే పోలవరం కార్యాలయం, పోలవరం స్పెషల్ కలెక్టర్ కార్యాలయం ఉన్నాయి. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు సైతం కోతుల గుంపుతో భయాందోళన చెందుతున్నారు. వాటర్ ట్యాంక్ వద్ద నీటి కోసం వచ్చేవారు వీటి దాడికి గురవుతున్నారు. కాగా.. ఈ సమస్యను అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళతామని ధవళేశ్వరం పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు తెలిపారు.

ఆటోను తప్పించబోయి లారీ బోల్తా



బోల్తా పడిన లారీ



ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం ఇనుప మెట్లు

రాజమహేంద్రవరం రూరల్: ఆటోను తప్పించబోయి లారీ బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే.. బొమ్మూరు జాతీయ రహదారిపై వైఎస్సార్ సెంటర్‌లో ఓ ఆటోను తప్పించబోయే క్రమంలో లారీ.. అక్కడ వైఎస్సార్ విగ్రహ వద్ద ఉన్న ఇనుపమెట్లను ఢీకొంది. అలా ముందుకు వెళ్లి సెలూన్ షాపును ఢీకొట్టి బోల్తాపడిన పడింది. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కడియం మండలం దుళ్ల నుంచి విశాఖపట్నానికి అట్ట పెట్టెల లోడుతో లారీ వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సంఘటనా స్థలాన్ని బొమ్మూరు పోలీసులు పరిశీలించారు. ఈ ప్రమాదంలో వైఎస్సార్ విగ్రహం ఇనుప మెట్లు, సెలూన్ షాపు ధ్వంసమయ్యాయి.

మాజీ మంత్రి వేణు పరామర్శ



హబీబుల్లా ఖాన్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ హబీబుల్లాఖాన్ అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో, ఆయనను సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. మాజీ మంత్రి వెంట సిటీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షబ్బీర్, సిటీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ అరిఫుల్లాఖాన్, రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మీర్జా మౌలాలి, జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ అధ్యక్షుడు ఎండీ ఆరిఫ్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ నిజాం తదితరులు ఉన్నారు.

ఎరువులపై సదస్సు

కడియం: నానో యూరియా, నానో డీఏపీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.సూర్య రమేష్ కోరారు. ఈ మేరకు సోమవారం మురమండ సహకార సొసైటీ వద్ద నానో ఎరువులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ పైపాటు ఎరువులకు ప్రత్యామ్నాయంగా వీటిని వినియోగించుకోవచ్చునన్నారు. రైతులు వినియోగ సౌలభ్యానికి అనుగుణంగా వీటిని రూపొందించారన్నారు. సమావేశంలో సొసైటీ త్రీమెన్ కమిటీ అధ్యక్షులు వట్టికూటి జానకి రామ్మయ్య స్థానిక రైతులు ఉన్నారు.

రామవరం, పులగుర్త హైస్కూళ్ల తనిఖీ

అనపర్తి: రామవరం, పులగుర్త జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎంఈవో ఎస్.సత్తిరెడ్డి, కుతుకులూరు క్లస్టర్ హెచ్ఎం విజయభారతి సోమవారం తనిఖీ చేశారు. అసెస్మెంట్ పుస్తకాలు, రాత పుస్తకాలు, విద్యార్థుల గ్రేడింగ్, టీచర్ మ్యాడ్యూల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం తదితర విషయాలను పరిశీలించారు. ఉదయం పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె సీతామహాలక్ష్మి ఎఫ్ఏవన్ పరీక్షలో క్లాస్ టాపర్లకు, క్లాసు లీడర్లకు గుర్తింపు బ్యాడ్జీలు, బహుమతులు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం స్టాఫ్ సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని, లోపాలను సరిదిద్దుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని క్లస్టర్ ప్రధానోపాధ్యాయిని విజయభారతి అన్నారు. అనంతరం మధ్యాహ్నం రామవరం పాఠశాలలో తనిఖీ నిర్వహించారు. అక్కడి రికార్డులను పరిశీలించారు.

రూ.1000 నాణెం విడుదల



ముంబై టంకశాల విడుదల చేసిన రూ.1000ల నాణెం



నాణేల సేకరణ కర్త శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: దక్షిణ భారతదేశంలోని గొప్ప చోళ చక్రవర్తులలో ఒకరిగా గుర్తింపు పొందిన రాజేంద్ర చోళుడి నావికా యాత్ర 1000వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ముంబై టంకశాల రూ.1000 నాణేన్ని విడుదల చేసింది. దాన్ని రాజమహేంద్రవరానికి చెందిన నాణేల సేకరణ కర్త పెద్దిరెడ్డి శ్రీనివాస్ సోమవారం పొందారు. 40 గ్రాముల వెండితో తయారు చేసిన ఈ నాణెం ముందు వైపు భారత దేశ రాజముద్ర, వెయ్యి రూపాయల ముఖ విలువను ముద్రించారు. వెనుక వైపు రాజేంద్ర చోళుని ముఖచిత్రంతో పాటు తంజావూరులోని బృహదీశ్వరాలయం, చోళుడు ప్రయాణించిన నౌకలను ముద్రించారు. కాగా.. రాజేంద్ర చోళుడు క్రీ.శ. 1014 నుంచి 1044 వరకు పాలించాడు. అతడి పాలనలో, చోళ సామ్రాజ్యాన్ని సముద్రాలు దాటి విస్తరించాడు. దానిలో భాగంగా 1025 ప్రాంతంలో నావికా దండయాత్రలను ప్రారంభించాడు.

హోమియో వైద్యులతో సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ: హోమియో వైద్యులు తమ దైనందిన విధులను డైరీలో తప్పక నమోదు చేయాలని అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం ప్రభుత్వ హోమియో ఆస్పత్రుల వైద్యులతో ఆయన సమీక్షించారు. ఆస్పత్రుల సమయ వేళలు, మందుల నిల్వలు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అవుట్ పేషెంట్ల వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, మందుల కొరత ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని, ఆస్పత్రుల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉండాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

కొండబాబుకు సత్కారం



బర్రె కొండబాబును సత్కరిస్తున్న ప్రముఖులు

సీటీఆర్ఐ: ప్రముఖ సాంస్కృతిక సంస్థ విశ్వజన కళా మండలి 49వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రె కొండబాబును సత్కరించారు. ఈ విషయాన్ని సోమవారం తన నివాసంలో ఆయన విలేకరులకు వివరించారు. క్వారీ గోతుల్లో పడి అమాయకులు మృతి చెందుతుండడంపై తాను పోరాటం చేస్తున్నానని, ఈ విషయంపై గవర్నర్, మంత్రులు, ముఖ్యమంత్రులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ పోరాటాలను దృష్టిలో పెట్టుకుని తనను సత్కరించారన్నారు.

కడియం ఆస్పత్రిలో సమీక్ష

కడియం: ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మాధురి, కడియం ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, ముద్రగడ జెమి, ఎంపీడీవో రమేష్, అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చిలుకూరి ప్రభ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల :	ఘాటీ
సూర్యమినీ :	ది కంజ్యూరింగ్
సూర్యప్యాలెస్ :	ఘాటీ
స్వామి :	కూలీ
అనుశ్రీ :	మదరాసి
శివజ్యోతి :	ది బెంగాల్ ఫైల్స్
రాజా :	మదరాసి
ఊర్వశి :	లిటిల్‌హార్ట్స్
మేనక :	ది కంజ్యూరింగ్
రంభ :	మహావతార్ నరసింహ
అప్సర :	కొత్తలోక
అశోక :	మదరాసి
నామవరం	
వీఎస్ మహల్ :	ఘాటీ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	ఘాటీ, మదరాసి
కడియం	
వెంకటసూర్య :	మదరాసి, ఘాటీ